క్లుప్తంగా

నూతన ఎస్ఐకి సన్మానం



ఎస్ఐని సన్మానిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయపురం : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బలరాం సోమవారం వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచ్ శాలువతో సన్మానించి, పుష్ప గుచ్ఛాలు అందజేశారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడడానికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు కావాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరాములు రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబు, రాజ్‌గోపాల్, సురేష్, కుప్పయ్య, రాజేంద్రన్, మనోహర్‌రెడ్డి, సుధాకర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై చర్చ



అధికారులతో చర్చిస్తున్న నారాయణ

నింద్ర: మండలంలోని చిత్తూరు–తచ్చూరు హైవే సర్వీసు రోడ్డు సమస్యపై జాతీయ సీపీఐ కార్యదర్శి కె.నారాయణ చేపడుతున్న ఆందోళన సోమవారం రెండో రోజుకు చేరింది. రైతుల సమస్యపై సంబంధిత హైవే పీడీ కిరణ్, నింద్ర తహసీల్దార్ శేషగిరిరావు నారాయణతో చర్చించారు. రైతులకు సమస్య లేకుండా చూడాలని అయన అధికారుల దృష్టిని తీసుకొచ్చారు. రైతులకు పొలాలకు దారి సౌకర్యం ఉండాలని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని రైతులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల పని వేళల్లో మార్పు

పుత్తూరు: రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పని వేళలు మార్పు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి.గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని గంటలుగా తెలిపారు. ఇందులో ఉదయం 9 నుంచి సాయంత్రం 4–10 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5 వరకు స్టడీ అవర్స్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కళాశాల పని వేళలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గ్రహించాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పారిశుద్ధ్య కార్మికులతో వైద్యులు

కార్వేటినగరం : నియోజకవర్గంలోని పారిశుద్ధ్య కార్మికులను సోమవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి గోపీనాథ్ మాట్లాడుతూ ప్రజలు రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రం చేస్తూ నిత్యం శ్రమించే పారిశుద్ధ్య కార్మికులు దైవంతో సమానమని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజశేఖర్, వైద్యులు లక్ష్మీపతి, ప్రవీణ, సత్యవాణి, యూసఫ్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మోహన్‌మురళి

వెదురుకుప్పం : అండర్–14, 17 విభాగాల్లో క్రీడా పోటీలను సోమవారం పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ సభ్యుడు మోమన్‌మురళి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. పీటీ ఉష, కరణం మల్లీశ్వరి, ప్రమోద వంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహేశ్వరరావు, పీడీలు రమే ష్, త్రిలోకసుందరి, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విజేతలకు బహుమతులు



ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం జెడ్పీ హైస్కూల్‌ల్ ఆదివారం శ్రీ కళాతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత నృత్య పోటీల్లో విజేతలకు శ్రీ లక్ష్మీ మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ అధినేత ప్రసాద్ రూ.10వేల విలువైన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సిద్ధయ్య పాల్గొన్నారు.

ఇసుక జాడేదీ?

- ఆగిన పలు నిర్మాణాలు
- ప్రభుత్వం తీరుతో దొరకని ఇసుక
- ప్రకటనలకే పరిమితమవుతున్న ఇసుక సరఫరా



ఇసుక లేక ఆగిన ఇంటి నిర్మాణం

విజయపురం : కొత్త ప్రభుత్వం వచ్చిన తక్షణం ఇసుకలో కాసుల వేట సాగుతోంది. ఉచితం అని చెప్పినా ఎక్కడా దొరక్క పోవడం గమనార్హం. ఇసుక కావాలంటే మాఫియాను వెతుక్కుంటూ వెళ్లాల్సి వస్తోంది. అనధికారిక ర్యాంపు లన్నీ అధికార పక్ష నేతల గుప్పిట్లో ఉండడంతో ఇసుక వారికి కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఇసుకను సరఫరా చేయకుండా జాప్యం చేస్తూ తమ పార్టీ నాయకులకు పరోక్షంగా లబ్ధి చేకూరుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక స్టాక్ పాయింట్లు ఎక్కడా కనిపించలేదు. ఇది వరకు సరఫరా చేసిన ఇసుక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తవ్వి తీసిన ఇసుకతోనే ఆర్భాటం చేసింది. ఆ ఇసుక కూడా జూలై 26 తేదీకే విక్రయం జరిగిపోయింది. అంటే దాదాపు 47రోజులు కావస్తున్నా నియోజకవర్గంలో అధికారికంగా ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. ఇదిగో అదిగో అని కాలయాపన చేసి చివరకు సెప్టెంబర్ 11 నుంచి ఇసుక సరఫరా చేస్తామని ప్రకటించింది. ఆ ప్రకటన కూడా అమలు జరగడం లేదు. కనీసం ఇసుక విక్రయాలకు ఒక్క స్టాక్ పాయింటు కూడా ఏర్పాటు చేయలేదు.

ఉచితం పేరుతో..

ఎన్నికలకు ముందు కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చారు. అరచేతిలో వైకుంఠం చూపించారు. వరాల జల్లు కురిపించారు. ప్రజలు కూడా నమ్మేశారు. అంతే అధికారం దక్కించుకున్న కూటమి నాయకులు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఇసుక ఉచితం పక్కన పెడితే గత ప్రభుత్వంలో కంటే ఎక్కువ ధరకు ఇసుకను విక్రయిస్తున్న పరిస్థితి ఏర్పడింది. ఒక్కో ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు నుంచి రూ.6వేల వ రకు విక్రయిస్తున్నారు. ఇంత పెట్టి కొనలేక లబ్ధిదారులు, భవన కార్మికులు నిర్మాణ పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ప్రభుత్వంలో అధికారికంగా సేకరించి ఉ న్న ఇసుకను స్టాక్ పా యింట్ పెట్టి ఈ ప్రభు త్వం అమ్ముకుని సొమ్ము చేసుకుంది. ఆ తరువాత లబ్ధిదారులకు అవసరమైన ఇసుక సేకరించడంలో విఫలమైందని దుమ్మెత్తిపోస్తున్నారు.

ఇల్లు నిర్మాణం సరే... ఇసుక ఎక్కడ

మండలంలో ఇంటి నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఇసుక ఎక్కడ ఉందో తెలపడం లేదు. ఇసుక లేక ఇంటి నిర్మాణం ముందుకు సాగడం లేదు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఓ పక్క జిల్లా అధికారులు ఇంటి నిర్మాణం వేగవంతం చేయాలని ఒత్తిడి తీసుకొస్తుంటే..మరో పక్క ఇసుక లేక లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం చేయడానికి ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ఇసుక ఉన్న చోటు చూపించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఇదిగో...అదిగో...

ఇదిగో అదిగో అంటూ అధికారులు ప్రకటనలు చేయడం తప్ప అధికారికంగా ఇసుక సరఫరా చేయడం లేదు. దాదాపు 47 రోజులుగా అధికారికంగా ఇసుక దొరకడం లేదంటే ఈ ప్రభుత్వ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫలానా తేదీల్లో.. ఫలాన స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక విక్రయిస్తామని చెప్పడం... ఆ తేదీలు వచ్చేసరికి చేతులెత్తేయడం తప్ప మరొకటి కనిపించడం లేదు. అధికారిక ఇసుక స్టాక్ పాయింట్లు లేవు. దీంతో ఇసుక కోసం వినియోగదారులు అక్రమార్కులను ఆశ్రయించాల్సి వస్తోంది. డబ్బులు ఖర్చు పెట్టగలిగేవాళ్లు టీడీపీ దళారుల వద్ద కొనుగోలు చేసుకుంటుండగా, అంత ఖర్చు పెట్టలేని వాళ్లు నిర్మాణాలు నిలిపేసి ప్రభుత్వం సరఫరా చేస్తామన్న ఇసుక కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వ తీరుతో ప్రస్తుతం భవన నిర్మాణ రంగం కుదేలైంది. నియోజకవర్గంలో 20వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారు. కూటమి ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడంతో ఇసుక సమస్య తీవ్రంగా మారింది.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు

విజయపురం : మండలంలో రేపటి నుంచి మండల స్థాయి క్రీడలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి హరిప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జంబాడ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగాతో పాటు అథ్లెటిక్స్ క్రీడలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో వెలసిన అవుదేవర మీనాక్షి సమేత నందీశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామునే స్వామివారికి అభిషేకం జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై కొండ మల్లీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.

జాతీయ పోటీలకు క్రీడాకారులు



జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్న రాష్ట్ర జట్టు

నగరి : జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్‌లో పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర బాలుర, బాలికల టీం హర్యానాకు బయలుదేరినట్లు జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి బాలాజి తెలిపారు. అన్నవరం నుంచి జాతీయ జట్టు మేనేజర్ సూరిబాబు, కోచ్ రాజు ఆధ్వర్యంలో 20 మంది క్రీడాకారులతో కూడిన ఈ జట్టు హర్యానాకు చేరుకుంటుందన్నారు. హర్యానా రోథక్‌లోని సైనిక్ సెకండరీ స్కూల్‌లో ఈ నెల 25 నుంచి 29 వరకు జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలు



పరికరాలతో పారిశుద్ధ్య కార్మికులు

కార్వేటినగరం : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం పారలు, తట్టలు తదితర పరికరాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామాల్లో రోగాలు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తుంటారని కొనియాడారు. ప్రజలు కూడా వారికి సహకరించి వ్యర్థాలు మురుగునీటి కాలువలు, వీధుల్లో నిర్లక్ష్యంగా పడేయకుండా చెత్తబుట్టలో వేసి అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఉప సర్పంచ్ పవన్‌కుమార్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు మద్దతుగా సిబ్బంది సంఘీభావం

గుడిపాల: సర్వీసులో ఉన్న వైద్యులకు పీజీ ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించి వారికి అన్యాయం చేసినందున మండలంలోని బొమ్మసముద్రం పీహెచ్‌సీ వారికి మద్దతుగా సంఘీభావం తెలిపారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి వైద్యులకు మద్దతు పలికారు.



వైద్యులకు మద్దతు తెలుపుతున్న వైద్య సిబ్బంది

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయిలు

యాదమరి(పూతలపట్టు): జిల్లా పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని మాధవరం, కోడిగుట్ట 70 కొత్తపల్లి, పుల్లయ్యగారిపల్లి, వరిగపల్లి , యాదమరి, కొటాల గ్రామాల్లోని పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కనకాచారి, శంకర్, శివప్రసాద్, సురేష్‌రెడ్డి, ఆనంద్ పిళ్లై పాల్గొన్నారు.

పుత్తూరు కమిషనర్‌గా మంజునాథగౌడ్



పుత్తూరు: మున్సిపల్ కమిషనర్‌గా ఎం.మంజునాథగౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూల్ జిల్లా నందికొట్కూర్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న మంజునాథగౌడ్ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న కెఎల్ఎన్‌రెడ్డిని కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

విజయపురం : మండలంలో నేటి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏవో రజనీ కుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఆమె తెలిపారు. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలను రైతులకు ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తామన్నారు. విత్తనం నాటిన నాటినుంచి పంటలకు ఎరువులు, పురుగుమందుల వాడకంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించి, తక్కువ పెట్టుబడితోనే అధిక దిగుబడులు సాధించడానికి కల్పిస్తామన్నారు. రైతులు పొలంబడి కార్యక్రమంలో పాల్గొని పంట సాగుపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

అన్నదానం ట్రస్టుకు విరాళం



నగదు విరాళం అందిస్తున్న దాత

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్య అన్నదానం ట్రస్టుకు ఓదాత సోమవారం నగదు విరాళం చేశారు. బెంగళూరుకు చెందిన దాత విఘ్నేష్ చరిత రెడ్డి రూ.2,00,202 నగదును ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాత కుటుంబానికి ప్రత్యేకంగా స్వామి దర్శనం కల్పించి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు



కార్మికులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

నగరి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హిసేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులు సరఫరా చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యసేవలు కొనసాగాయి. వైద్యసేవలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పరిశీలించారు. వైద్యులు జరీనా, కార్తికేయన్, ప్రశాంతి, ఉష, శ్రీనాథ్, మహేష్, పూజిత, మౌనిక, జ్యో త్స్న, లోకేష్, ప్రసాద్, అజిత వైద్యసేవలు అందించగా ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, శానిటరీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో గేట్‌పుత్తూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

పుత్తూరు: పట్టణంలో జరుగుతున్న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో స్థానిక గేట్ పుత్తూరు జెడ్పీ హెచ్ఎస్ తెలుగు విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు హెచ్ఎం కె.జె.వేములు తెలిపారు. ఖోఖో అండర్ -17, 14 విభాగాల్లో బాలురు, బాలికల జట్లు, కబడ్డీ అండర్ 14- 17 విభాగాల్లో బాలికల జట్లు విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు. షాట్‌పుట్ అండర్-17లో శివకుమార్ ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. రన్నింగ్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలను జాఫర్, లోకేష్ సాధించినట్లు తెలిపారు. ఈ క్రీడాకారులను సోమవారం పీడీలు, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

వీడ్కోలు సన్మానం

పాలసముద్రం : బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డిని సోమవారం సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఆదర్శనీయమని కొనియాడారు. ఏఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్ పాల్గొన్నారు.



రామనాథరెడ్డిని సత్కరిస్తున్న సచివాలయ సిబ్బంది

సాంస్కృతిక సౌరభం

















ప్రత్యేక ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. హరికథకాలక్షేపం, కూచిపూడి, భరతనాట్యం, గీతాలాపనలు, పౌరాణిక నాటిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. అద్భుత ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు భక్తులు చప్పట్లతో అభినందించారు. అనంతరం అధికారులు బహుమతులు ప్రదానం చేశారు. –కాణిపాకం